# ఇదా ప్రగతి

బి. సాయిరమేష్ (రాధ)

ఈ మధ్యే స్వదేశాన్ని సందర్శించ టానికి వచ్చాను యింగ్లాండు నుంచి వచ్చే ముందు బ్రిటన్‌లో వున్న తెలుగు వారు తెలుగుదేశం నుంచి బంధు మిత్రులు తెలియఁ జెప్పింది ఒకే ఒక్క సందేశం- అమ్మో యిండియాలో ఎంత మార్పు వచ్చిందో వెళ్ళి చూడండి మీకే తెలుస్తుంది' అని

స్వతంత్ర భారత దేశంలో చెప్పుకో దగ్గ ప్రగతి వచ్చిందనీ వస్తూనే వుందనీ రకరకాల దేశాల టెలివిజన్ డాక్యుమెంటరీలలో సంక్షిప్త వార్తలలో ఎన్నో సార్లు సచిత్రంగా చూడడం జరిగింది ఆ బేక్‌గ్రౌండ్ విశేషాలలో భారత దేశం నిస్సందేహంగా మరో వున్నత స్థాయిని చేరుకుందనీ అక్కడ మానవతా విలువలు మరో మలుపు తిరిగి భారత మాత వన్నెకి మెరుగులు దిద్దుకున్నాయనీ కొండంత ఆశించి కోటి వూహలతో బొంబాయి యింటర్నేషనల్ విమానాశ్రయంలో అడుగు పెట్టాను. ఓ ఐదు వారాల క్రితం. కాని నా ఆశలు అడియాశలే అయ్యాయని చెప్పటానికి ఎంతగానో చింతిస్తున్నాను. మొదట నన్ను స్తబ్ధుడ్ని చేసింది. నా వూహల్ని కనిపించనంతగా చిన్న బుచ్చింది విమానాశ్రయంలో సిబ్బంది చూపించిన తీరులో నగ్నంగా దాగి వున్న లంచగొండితనం. అంత పెద్ద అమెరికా దేశంలో 'టిప్' పేరున చలామణీ అవుతున్న లంచగొండితనం మన దేశంలో మాత్రం వుంటే తప్పేముందని సర్ది పుచ్చుకుని తెలుగుదేశం తరలివస్తే నన్ను మరింత కలవర పరిచింది వరకట్న పిశాచం, ఆపైన కులమత భేదాలు వాటన్నింటి పైనా మన ప్రజలు స్త్రీ జాతిపట్ల చూపిస్తున్న పక్షపాత వైఖరి.

చాన్నాళ్ళకి స్వదేశం వచ్చాను కదా అని ఓ పెద్ద మనిషి నన్ను పలకరించటానికి వచ్చాడు పాపం ఎంతో శ్రమపడి. మాటల సందర్భంలో ఆయన తన కుమార్తెకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నానని చెప్తూ ఓ చిన్న కథ చెప్పాడు యిలా:-

మొన్నీ మధ్య ఓ వుద్యోగం వున్న కుర్రవాడి కుటుంబ సభ్యులు అమ్మాయిని చూసుకోటానికి వచ్చారు. ఎప్పటిలా పెళ్ళి చూపుల పేరు పెట్టి ఓ పూట మా యింట మకాం వేసి, కావలసిన తినుబండారాలన్నీ కడుపారా ఆరగించి కాఫీ వగైరాలు తృప్తిగా సేవించి సిలింగుకి వ్రేలాడుతున్న పంకా సుతారంగా పిల్ల వాయువుల్ని వీయిస్తుంటే (కరెంట్ బిల్లు సంగతి ఆలోచించే వాడ్ని నేను తప్పించి యింకెవరుంటారు చెప్పండి కట్టేవాడ్ని యింటికి ఏకైక సంపాదకుడ్ని నేనేగా) పెళ్ళి కుమారుడి తల్లి తాయారమ్మ చల్లగా మెల్లగా యిలా అడిగారు- యింతకీ అమ్మాయికి ఆస్తి రూపేణా (తెలివైన యిల్లాలు వరకట్నం వూసు ఎత్తితే రికార్డు చేసి ఎక్కడ అధికారులకి వినిపిస్తానో ఏమిటో) ఏం ముట్ట చెప్పాలనుకుంటున్నారు?

అమ్మాయికి చెప్పించిన ఎమ్ కామ్ చదువు + ఏదో వంటి మీద వ్రేలాడుతున్న ఐదారు కాసుల బంగారం తప్పించి యింకేమీ యివ్వలేమని నాకు తెలుసు, దూరంగా నిలబడి దిక్కులు లెక్కిస్తోన్న నా జీవితార్థాంగి జగదాంబకు తెలుసు. అందుకే ఏం సమాధానం చెప్పాలో తోచక ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం!

'మీకు తెలియందేముంది' నేను నసిగాను, మధ్యవర్తి మాగురించి మీకు వివరంగా అన్నీ తెలియజేసి వుండాలే అన్నట్లు సూచిస్తూ.

'ఆ..... ఆ..... ఎందుకు తెలీదు.. మార్తాండ శాస్త్రి (మా మధ్యవర్తి లెండి) అంతా చెప్పాడు... అమ్మాయి చందనపు బొమ్మలా వుంది. అందులో సందేహం ఏమాత్రం లేదు.... కాని పెళ్ళి కుమారుడి సంగతి మీరు కూడా కాస్త ఆలోచించాలిగా అన్నయ్యగారూ.... కష్టపడి బి. యి. చదివాడు చేస్తోన్న కంపెనీ ప్రయివేట్‌దే అయినా.... చేస్తున్న పనిమాత్రం అసిస్టెంట్ యింజనీరుగానే.... గుమాస్తా మాత్రం కాదు... పోతే వాడికి వచ్చే జీతం సిగరెట్లకీ, సెంటు బుడ్లకీ కూడా సరిపోదు..... ఈరోజుల్లో ఓ మోస్తరుగా బ్రతకాలన్నా కనీసం ఐదారు వేల రాబడైనా వుండాలి, నెలనెలా... పైగా వీడైతే యింజనీరాయే.... చూస్తూ చూస్తూ ఆఫీసుక్లర్కులా ఎలా బ్రతగ్గలడు మీరే చెప్పండి.... మీ అమ్మాయి కాసో్త కూసో్త తెచ్చుకుంది అనుకోండి హాయిగా లక్షణంగా సంసారం చేయగల్గుతుందీ... పిల్ల పాపల్ని మహా గొప్పగా పెంచుకు వస్తుంది.... ధన ధాన్యాదులు ఈరోజు వుంటాయి రేపటికి హరించుకు పోతాయి కాని మన పిల్లలు మనకిచ్చే ఆత్మతృప్తి మాత్రం వుంది చూశారూ అది పెర్మనెంటే మరి మనం నిదానంగా ఆలోచించంకాని మా అక్కాయి మోమాటస్థురాలు కాని తలచుకుంటే అయిదారు లక్షలు యిచ్చేవాళ్ళు యిట్టే వస్తారు!" సుదీర్ఘంగా శలవిచ్చింది పెళ్ళి కుమారుడి తల్లిగారి చెల్లెలు గారైనా అండాళమ్మ అసలు విషయం ఆఖరికి వెళ్ళగక్కుతూ నా నోట్లో వాక్కాయ చెట్టుకి వెలక్కాయ చెట్టుకీ క్రాస్ చేస్తే వుద్భవించే వృక్షానికి దేనికో పుట్టిన పచ్చికాయ లాంటి దేదో అడ్డం పడ్డట్లయ్యింది ఆక్షణం!

అమోరిస్తే సరి ఈడ్చి తన్నితే యింట్లో అయిదారు వేల కేష్ అయినా లేదు ఐదు లక్షలు ఎక్కడ నుంచి తెస్తావురా సుబ్బరామశాస్త్రి అని ఆక్రోశించాడు నా ఆత్మగాడు ఇక మా ఆవిడ సంగతి వేరే చెప్పాలా ఆ పది నిముషాల్లో మా అద్దె యింటి దూలాలు ఓ యిరవై పర్యాయాలన్నా లెక్కించి వుంటుంది ఆ మహా యిల్లాలు పాపం?

"చూడు బాబు..." ఓ స్థాయికి వచ్చాక యింట్లోకంటూ ఓ టి.వి, బయటకంటూ ఓ స్కూటర్ లేకపోతే ఏం బాగుంటుంది చెప్పు.. అనుభవించేది మీ అమ్మాయేగా.... మనం కష్టపడి కాసో్త కూసో్త వెనుక వేసేది ఎవరి కోసం... మన వారసులకేగా... నీకు మాత్రం, ఎందరున్నారు కనుక హైరానా పడటానికి... యిద్దరే యిద్దరు కూతుళ్ళు అవునా... పోతే నువ్వేమో మున్సిపల్ ఆఫీస్‌లో ఓ పది సంవత్సరాలు పైగా హెడ్ గుమాస్తాగా పని చేస్తున్నావని విన్నాను.... బాగా రాబడి వున్న వుద్యోగమేనటగా... ఆ మాత్రమో, ఈ మాత్రమో పొదుపు చేసే వుంటావు... యిలాంటి అవకాశం అవసరం మళ్ళీ మళ్ళీ కలుగుతాయా చెప్పు... గుండె దిటవు చేసుకుని తీసి ఖర్చు పెట్టాలే తప్పించి... నువ్వు మాత్రం ఎంత కాలం దాయగలవు గడిధచ్చిందంతా...' సాగదీస్తూ శలవిచ్చింది పెళ్ళి కుమారుడి పితామహురాలు పేరిందేవమ్మ.

ఏదో అంటువ్యాధి అర్ధాంతరంగా వచ్చినట్లు అంటుకున్నాయి నా కళ్ళు. నా ముప్పై సంవత్సరాల సర్వీస్‌లో ముప్పై పైసలయినా లంచంగా పుచ్చుకున్న పాపాన పోలేదు. అలాంటి నన్ను ఆ మహా యిల్లాలు కాసో్త కూసో్త గడించి వుంటావుగా అని వెటకరిస్తుందా. ఆవిడకేమి తెలుసు నాకు లంచగొండితనం అబ్బనందువలన ఎన్నిసార్లు పై అధికారులతో చీవాట్లు తినవలసి వచ్చిందో, ఎన్నిసార్లు రావలసిన ప్రమోషన్ వచ్చి మరీ ఆగిపోయిందో? నాకు వళ్ళు మండింది. కాని మా ఆవిడ నీళ్ళు కారే ముఖం చూడగానే చల్లబడి పోయింది మరుక్షణంలో.

మర్యాదగా గృహ ద్వారం చూపించి వెళ్ళి రండని సవినయముగా మనవి చేసుకోటం కంటే నేను చేసేది ఏమీ లేకపోయింది.

ఇది బాబు మా అమ్మాయి పెళ్ళి చూపుల పురాణంలో మొదటి అధ్యాయం.

ఆ తరువాత అధ్యాయాల్లో యిలాంటివే ఓ ఐదారు

సంబంధాల కథలున్నాయి  వివరాలన్నీ చెప్పి నిన్ను విసిగించటం సబబు కాదు కాని  ఏదో ఆడపిల్ల తండ్రిని కాబట్టి మనసు పట్ట లేక చెప్తున్నాను ఏమీ అనుకోమోక  ఆ పడమటి దేశాల్లో యిలాంటి గొడవలు వింటామా కంటామా

ఆ తరువాత ఆయన మాటల్ని బట్టి నాకు అర్థమయిoంది యిది-


ఆ అమ్మాయిని చూసుకోటానికి వచ్చిన వాళ్ళలో కొందరు అమ్మాయికి పాట పాడటం, సంగీతం ఎందుకు రాదు అన్న వాళ్ళు- ఎమ్ కామ్ ఎందుకు చదివావు వుద్యోగం చేస్తావా అన్ని ఎదురు అడిగిన వాళ్ళు- ఎమ్ కామ్ ఎందుకు చదివావు  ఎమ్ ఎ ఎందుకు చేయలేదు అని అర్థం లేని సంబాషణ సాగించిన వాళ్ళు ఎందరో వున్నారనీ సుమారు అందరూ వరకట్నం పేరు ఎత్తకుండా పెళ్ళి లాంచనాలన్న మారు పేరుతో కొసరి కొసరి బేరం ఆడిన వాళ్ళే అని అలా ప్రతి ఒక్కరూ ఆయన నిజాయితీని సహనాన్ని పరీక్షించటం మొదలు పెట్టడంతో విసుగెత్తి యిప్పుడు ఎవరైనా పిల్లని అడగటానికి వస్తే వీది గుమ్మం దగ్గరే నిలబెట్టి నిలదీసి యిలా చెప్పేస్తున్నాడట పాపం ఆ పెద్ద మనిషి-

చూడండి మా అమ్మాయి బర్రె కాదు  ఖరీదైన పెయింటింగ్ కాదు బేరాలాడ అమ్ముకోటానికి, వేలం వేసి కొనుక్కోటానికీను  చదువుకున్న ఆడ పిల్లండీ  మీ అబ్బాయిలానే కష్టపడి చదివిందండీ  జ్ఞానం పరిజ్ఞానం వున్న మనిషండీ  ఏదో సంఘం మారిందనీ, నైతిక విలవలు పెరిగాయనీ కల్లబొల్లి మాటలు చెప్పే మగ పిల్లల తల్లి దండ్రులకి నేను చెప్పేది ఒకే ఒక సమాదానం  నా కూతురికి పెళ్ళి కాకపోయినా పర్వాలేదు కాని ఆమెని మాత్రం వరకట్నానికి మారు పేరు పెట్టి బేరాలాడే మీలాంటి వారికి మాత్రం చచ్చినా అమ్మను  మైండ్ దట్

ఇలాంటి హృదయ విదారకమైన కథలు వింటే వాటికి అలవాటు పడ్డ మీలో ఎందరికో ఆశ్చర్యం కలగకపోవచ్చు అసహ్యం పుట్టకపోవచ్చు కాని దేశం ఎంతో మారిందని విన్న నాకు మాత్రం తీవ్రమైన వ్యదను కలిగించాయని చెప్పటంతో వింతేమీ వుండదని ఎవరైనా వప్పుకుంటారేమో?

ఇంతే కాదు యింకా వుంది వినండి-

పడిపోతున్న మా పాక యిల్లు కొట్టించి క్రొత్త యిల్లు కట్టించాలన్న వుద్దేశంతో టౌన్ ప్లానింగ్ కమీషనర్స్ ఆఫీసుకి వెళ్తే- ప్లానింగ్ పర్మిషన్‌కి పదిహేను వందలు, సిమ్మెంటు కోటాలు యిప్పించటానికి కొంత ముత్తం యిలా ప్రతీదానికీ ఎంతో కొంత ముందే నిర్ణయించబడిన లంచం వుందని తెలిసినప్పుడు నాకు అనిపించింది ఒక్కటే- పది సంవత్సరాల క్రితం నేను యిండియా వదిలినప్పుడు పరిస్థితి ఎలా వుందో యిప్పటికీ అలాగే వుందని (కొన్ని కొన్ని విషయాల్లో మరింత అద్వాన్నంగా వుందని) నాకు కనిపించిని పైపై ప్రగతి అంతా టూకీగా చెప్పాలంటే యిది-



తప్పకుండా ప్రొడక్షన్ ప్రారంబిస్తుందని చెప్పుకో బడుతున్న వుక్కు ఫ్యాక్టరీ

పేరుకి చెప్పుకోదగ్గ దూరదర్శన్ యంత్రాలు- అందులో అంతంత మాత్రంగా వస్తున్న ఒకే ఒక్క రాజకీయ పార్టీ వార్తలు

యింటికో వాహనం

ఓ వెలుగు వెలుగుతోన్న ఖాళీ స్థలాల వ్యాపారాలు

కాని అనాదిగా మనని అంటి వస్తోన్న వరకట్న పిశాచాలు, కుల మత అవస్థలు లంచగొండితనం యింకా మన అత్యున్నత విబిన్న సాంప్రదాయాల్ని కరచి పట్టుకుని అలాగే వున్నాయి  అవి మాత్రం మాసిపోయాయంటే నేనే కాదు మీరు మాత్రం నమ్ముతారా మీరే చెప్పండి?

తిరిగి వలస వెళ్ళే నన్ను మన దేశస్థులు ఎదురైనప్పుడు మన దేశం ఎలా వుందని అడిగితే జ్యోతి లక్ష్మి చీర కట్టింది చీరకే సిగ్గేసింది  అని పాడి చెప్తే బాగుంటుందంటారా లేక దేశం మారింది కాని మారవలసిన తీరులో మారలేదు అనమంటారా? డ్రయినేజీలు లేని పేటల్లో పేలస్‌లాంటి బవంతులు మనుషులు నడవటానికి చాలని వీదుల్లో లెక్క లేనన్ని మర యంత్రాలు వెలసినందుకు సంతోషిద్దాం కాని వరకట్నానికి బదులుగా ఏర్పడ్డ పెళ్ళి లాంచనాలు జీతాలకి ఎడిషనల్‌గా ఏర్పడ్డ మామూళ్ళు బలీయంగా వున్నాయనీ ఒక వేళ ఎవరైనా యిండియా తిరిగి వెళ్ళి పిల్ల పెళ్ళి చేద్దామన్నా యిల్లు కట్టి చూద్దామన్నా ముందుగా పై వాటి గురించి ఆలోచన పెట్టుకోండి అని హెచ్చరించమంటారా?

లేక స్త్రీ సంక్షేమం సంగతి మరచి, నీతి నిజాయితీల సంగతి ప్రక్కన పెట్టి, గుడిలో దేముడికి దణ్ణం పెడ్తే వాటి విషయం యిట్టే సర్ది పుచ్చుకోవచ్చుని తృప్తి పడి బారత దేశపు టెక్నాలజీ ప్రగతికీ రాజకీయపు అభ్యుదయానికీ పరిశ్రమల విప్లవానికీ ప్రస్తుతానికి గర్విద్దామని పూరడించ మంటారా??? □

వాట్ డు యు సే!!!